
క్లుప్తంగా

న్యాస్‌పై అవగాహన


మాట్లాడుతున్న కాంప్లెక్స్ హెచ్ఎం యాదగిరి

పెంచికలపేట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం న్యాస్‌పై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. 3, 6, 9వ తరగతి విద్యార్థుల్లోని అభ్యసన సామర్థ్యాలను పరీక్షించడానికి నిర్వహిస్తున్న పరీక్షల్లో ఉపాధ్యాయులు పాటించాల్సిన నియమాలను వివరించారు. కాంప్లెక్స్ హెచ్ఎం యాదగిరి, రిసోర్సు పర్సన్లు రాజీకమలాకర్ రెడ్డి, సాయి, వెంకటేశ్, ఎంఐఎస్ లావణ్య, సీఆర్పీలు, శ్యాం, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువైద్యాధికారిగా రమేశ్


బాధ్యతలు స్వీకరిస్తున్న రమేశ్

దహెగాం: మండల కేంద్రంలోని పశువైద్యశాలలో సోమవారం నూతన పశువైద్యాధికారిగా రమేశ్ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ప్రభుత్వం పశువైద్యాధికారి పోస్టులను భర్తీ చేయగా దహెగాంకు రమేశ్‌ను నియమించారు. నిత్యం అందుబాటులో ఉండి పశువులకు మెరుగైన వైద్యం అందిస్తామని పేర్కొన్నారు.

వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు


పూజలో పాల్గొన్న భక్తులు

దహెగాం: కార్తీక మాసం పురస్కరించుకుని మండలంలోని గెర్రె గ్రామంలో పల్లెప్రకృతి వనంలో ఉసిరి చెట్టు వద్ద సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు. అనంతరం వన భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిహారం ఇప్పించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న హత్తిని గ్రామస్తులు

దహెగాం: పీపీరావు ప్రాజెక్టులో ఇళ్లు కోల్పోయిన మండలంలోని హత్తిని గ్రామస్తులకు పూర్తిస్థాయిలో పరిహారం రాకపోవడంతో సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల విభాగంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. హత్తిని గ్రామంలోని 55 కుటుంబాలకు చివరిసారిగా వచ్చే పరిహారం అందలేదన్నారు. దీంతో ఇటీవల కోర్టును ఆశ్రయించగా పరిహారం చెల్లించాలని అధికారులను ఆదేశించినా జాప్యం జరుగుతుందన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిహారం త్వరగా ఇప్పించాలని గ్రామస్తులు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో బండారి రాజయ్య మనోజ్‌కుమార్, చంద్రశేఖర్, చంద్రగౌడ్, పోచయ్య, లక్ష్మి, లస్మక్క తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ వాంకిడి మండలంలోని ఆశ్రమ పాఠశాలలో నాసిరకం సరుకులను సరఫరా చేసిన వారిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించకపోవడంతోనే 60 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారని ఆరోపించారు. సంఘం నాయకులు హరిచంద్ర, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యాధికారికి సన్మానం

కెరమెరి: ఇటీవల మండల పశువైద్యాధికారిగా నియమితులైన సురేశ్‌ను సోమవారం చౌపానగూడ గ్రామానికి చెందిన చైతన్య యువజన సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సభ్యులు బొజ్జిరావు, రాము, వసంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కంకర తేలిన రోడ్డు.. ప్రజల తిప్పలు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- కొత్త రోడ్డు నిర్మించాలని స్థానికుల డిమాండ్


తారు తొలగించడంతో కంకర తేలి అధ్వానంగా మారిన రోడ్డు

తిర్యాణి: మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. నిత్యం ఇదే రోడ్డుపై నుంచి సాధారణ ప్రజలతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు రాకపోకలు సాగిస్తుంటారు. కానీ ఏళ్లుగా రోడ్డుపై ఏర్పడ్డ గుంతలకు మరమ్మతులు చేపట్టడం.. కొత్త రోడ్డు నిర్మించడం వంటి పనులు చేపట్టడం లేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మరమ్మతులు చేయాలని లేదా నూతన రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఇప్పటికే పలు సంఘాల ఆధ్వర్యంలో అనేక నిరసనలు, ఆందోళనలు చేపట్టినా, అధికారుల దృష్టికి అనేకమార్లు సమస్యను తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపణలు విన్పిస్తున్నాయి.

రోడ్డు తొలగించారు.. తారు మరిచారు..

అరటిపెల్లి స్టేజి నుంచి భీమన్న ఆలయం వరకు కొంతభాగం గుంతలు ఏర్పడిన చోట ప్యాచ్ పనులను చేపట్టేందుకు గాను గత 20 రోజుల క్రితం తారును తొలగించారు. కానీ పనులను ప్రారంభించకుండా అలాగే వదిలేశారు. దీంతో రోడ్డు మరింత అధ్వానంగా మారింది. భీమన్న ఆలయం నుంచి శ్రీ ఇన్‌క్లెయిన్ వరకు రోడ్డుపై ఏర్పడ్డ గుంతలతో రోడ్లపై ప్రయాణించడానికి వాహనదారులు, ప్రయాణికులు అష్టకష్టాలు పడుతున్నారు. రాత్రి పూట గుంతల రోడ్లపై రాకపోకలు సాగించాలంటేనే జంకుతున్నారు. మండల కేంద్రం నుంచి వందలాది మంది ప్రజలు నిత్యం ఉద్యోగాలు, నిత్యావసర సరుకుల కొనుగోలు కోసం మంచిర్యాల జిల్లాకు వెళ్తుంటారు. రహదారి ప్రయాణికులకు అనుకూలంగా లేకపోవడంతో నిత్యం ప్రయాణాలు సాగించడం ద్వారా డిస్క్ సమస్యలు తలెత్తుతున్నాయని ప్ర యాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు వెంటనే ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



రోడ్డుపై అధికంగా గుంతలు ఉండటంతో రాత్రివేళలో ద్విచక్ర వాహనంపై ప్రయాణించాలంటేనే భయంగా ఉంది. రోడ్డుకు ఎలాంటి మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి.

\- సార రమేశ్‌గౌడ్, రాళ్ల కన్నెపెల్లి

కొత్త రోడ్డు నిర్మించాలి



మండల కేంద్రం నుంచి శ్రీ ఇన్‌క్లెయిన్ వరకు నూతన డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలి. రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడంతో అత్యవసర సమయంలో రాకపోకలు సాగించేందుకు అష్టకష్టాలు పడుతున్నాం. రోడ్డు నిర్మాణంపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

\- పులి వెంకటేశ్, నాయకపుగూడ

ఏరియాలో పర్యటించిన జీఎం సీపీపీ


పని స్థలాలు పరిశీలిస్తున్న మనోహర్

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలో సోమవారం జీఎం సీపీపీ (కార్పొరేట్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్) మనోహర్ పర్యటించారు. ఈ సందర్భంగా గోలేటిలోని జీఎం కార్యాలయంలో ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాస్ జీఎం సీపీపీకి స్వాగతం పలికి మొక్కను జ్ఞాపికగా అందజేశారు. అనంతరం జీఎంతో కలిసి ఖైరిగూడ ఓసీపీని సందర్శించారు. ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో ఓసీపీకి సంబంధించిన ఉత్పత్తి వివరాలు తెలుసుకున్నారు. క్వారీలోపలికి వెళ్లి పని ప్రదేశాలను సందర్శించారు. అనంతరం ఉల్లిపిట్ట, డోర్లి గ్రామాలకు వెళ్లే మార్గంలో వాగుపై నిర్మిస్తున్న వంతెన పనులను పరిశీలించారు. వాట్టివాగు రిజర్వాయర్ రక్షణ కట్టను సందర్శించారు. ఓసీపీ వెస్ట్ వ్యూ పాయింట్ నుంచి పని స్థలాలతో పాటు ఉత్పత్తి ప్రక్రియను వీక్షించారు. క్వారీలోని నీటిని ఉపరితలానికి తరలించేందుకు ఏర్పాటు చేసిన పంపుల పనితీరు, నీటి పంపింగ్‌పై అధికారులకు పలు సూచనలు చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు. పీవో నరేందర్, ఏరియా ఇంజినీరు భీంరావు జాడే, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహెరా, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, ప్రాజెక్టు ఇంజనీరు వీరన్న, మేనేజర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సెమీస్కిల్డ్ వేతనాలు అందించాలి


వినతిపత్రం అందజేస్తున్న అంబాల ఓదెలు

రెబ్బెన: బెల్ట్ క్లీనింగ్ విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సెమీస్కిల్డ్ వేతనాలు అందించాలని తెలంగాణ సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం ఏరియా అధ్యక్షుడు అంబాల ఓదెలు అన్నారు. సోమవారం ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీలో బెల్ట్ క్లీనింగ్, క్యాంటీన్, బ్లాస్టింగ్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులతో పాటు ఏరియా స్టోర్స్‌లో పని చేస్తున్న కార్మికులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ 2022లో కాంట్రాక్టు కార్మికుల జేఏసీతో చేసుకున్న ఒప్పందాలను వెంటనే అమలు చేయాలన్నారు. లేనిపక్షంలో సింగరేణి వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. క్యాంటీన్‌లో పని చేస్తున్న కార్మికుల జీతాలు ఎగ్గొట్టి పరారైన కాంట్రాక్టర్ రమేశ్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ఏరియా స్టోర్స్‌లో పని చేస్తున్న కార్మికుల వేతనాల్లో నుంచి కట్ చేస్తున్న మాస్టర్ల వివరాలు, సీఎంపీఎఫ్ వివరాలను వెంటనే తెలపాలని, ప్రతీనెల జీతం స్లిప్పులు ఇప్పించాలని డీజీఎం శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందజేశారు. సింగరేణి లాభాల్లో నుంచి కాంట్రాక్టు కార్మికులకు రూ.5వేల బోనస్ చెల్లించగా, కొంతమంది కార్మికులకు చెల్లించటం లేదని వారికి వెంటనే బోనస్ అందేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి


పేరుకుపోయిన చెత్తాచెదారం

రెబ్బెన: గ్రామాల్లోని ప్రజలు రోగాల బారిన పడకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి సతీశ్ డిమాండ్ చేశారు. మండలంలోని వంకులం పంచాయతీ పరిధిలో గల రాళ్లపేట గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎక్కడి చెత్త అక్కడే ఉండటంతో అపరిశుభ్ర వాతావరణం ఏర్పడుతోందని తద్వారా ప్రజలు అనారోగ్యం బారినపడే ప్రమాదం ఉందన్నారు. గ్రామంలో చెత్తకుండీలు లేకపోవడంతో రోడ్డుపైనే చెత్తాచెదారం పేరుకుపోతోందన్నారు. అంగన్‌వాడీ సెంటర్ ముందే చెత్తాచెదారం పేరుకుపోయిన అధికారులు పట్టించుకోవటం లేదని పేర్కొన్నారు. కేంద్రానికి వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులు రోగాల బారిన పడుతున్నారని ఆరోపించారు. చెత్తాచెదారం తొలగించాలని అధికారులకు గ్రామస్తులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవటం లేదని మండిపడ్డారు. జిల్లా ఉపాధ్యక్షురాలు చాపిడి శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

కెరమెరి: విధులు ముగించుకుని ఇంటికి వచ్చే మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ శంకర్ మృతి చెందిన విషయం తెలుసుకుని సోమవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి ఓదార్చారు. నాయకులు అబ్దుల్ కలాం, మోతీరాం, భరత్, అంబాజీలు పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఇన్‌చార్జి సీఈవోగా సత్యనారాయణగౌడ్


మాట్లాడుతున్న చైర్మన్ ఓంప్రకాశ్

బెజ్జూర్: బెజ్జూర్ సహకార సంఘం ఇన్‌చార్జి సీఈవోగా జక్కుల సత్యనారాయణ గౌడ్‌ను నియమిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు సహకార సంఘం చైర్మన్ కుర్సింగ ఓంప్రకాశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో డైరెక్టర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పనిచేసిన వెంకటేశ్వర్ గౌడ్, సంజీవ్, డాటా ఆపరేటర్ మహేశ్‌లను ఉన్నతాధికారులు సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. దీనిపై తీర్మానించి సత్యనారాయణ గౌడ్‌ను ఇన్‌చార్జి సీఈవోగా నియమించి ఉన్నతాధికారులకు తీర్మాన నివేదికను పంపిస్తున్నట్లు వెల్లడించారు. సహకార సంఘం పరిధిలోని ఐదు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను యధాతథంగా నడిపించాలని కోరుతూ సైతం తీర్మానించినట్లు పేర్కొన్నారు. డైరెక్టర్లు రాచకొండ శ్రీవర్ధన్, గట్టు లలిత, తెలి బాపు, మేకల కోటేశ్, కమలాకర్, పెదం శ్రీహరి, శకుంతల, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు


కీర్తి శ్రావణ్ (ఫైల్)

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్‌కు చెందిన కీర్తి శ్రావణ్(28) వారం రోజులుగా కనపడటం లేదని తండ్రి రాజన్న సోమవారం ఫిర్యాదు చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు. వాంకిడి మండలం సరండి టోల్‌ప్లాజా వద్ద పెట్రోలింగ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న శ్రావణ్ గత నెల 28న విధులకు వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లగా తిరిగి రాలేదన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఆచూకీ దొరికిన వారు 8712670506కు సమాచారం ఇవ్వాలని సీఐ తెలిపారు.

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా బ్లూకోర్ట్ విధులు నిర్వహిస్తున్న ఆనంద్‌కుమార్ (38) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. డీఎస్పీ రామానుజం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంత్యక్రియల నిమిత్తం తక్షణ సహాయం కింద రూ.20 వేలు అందజేశారు. 2012 కానిస్టేబుల్ బ్యాచ్‌కు చెందిన వారు మరో రూ. 20 వేలు అందజేశారు. శోకేష్తో పరేడ్, దహన సంస్కారాలు నిర్వహించారు.

పామాయిల్ సాగు కోసం రైతులకు సబ్సిడీ


చెట్లను పరిశీలిస్తున్న అధికారి సుప్రజ

చింతలమానెపల్లి: పామాయిల్ చెట్లను సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కాగజ్‌నగర్ డివిజన్ ఉద్యానవన అధికారి సుప్రజ అన్నారు. సోమవారం మండలంలోని గంగాపూర్ గ్రామం శివారులో పామాయిల్ సాగు చేస్తున్న తోటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి సాగుపై పలు సూచనలు ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ రైతులకు మొక్కపై ప్రభుత్వం 90శాతం సబ్సిడీ ఇస్తుందని, నిర్వహణ కోసం ఎకరానికి ప్రతి సంవత్సరం రూ. 4200 రూపాయలు చొప్పున 4 సంవత్సరాలు మంజూరు చేస్తారన్నారు. మాట్రిక్స్ కంపెనీ సీఈవో ఉదయ్ కుమార్, ఫీల్డ్ అధికారులు రమేశ్, సచిన్, రైతులు పాల్గొన్నారు.

కులగణన సర్వే పకడ్బందీగా నిర్వహించాలి


వాంకిడి: శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైయినీ


దహెగాం: మాట్లాడుతున్న తహసీల్దార్

వాంకిడి: కుల గణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ రియాజ్ అలీ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్‌లకు సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వే నిర్వహణ విధానంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సర్వే విధానంపై మాస్టర్ ట్రైయినీలు రాజలింగు, సుశీల్ కుమార్, హరీశ్‌లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎంఈవో శివచరణ్ కుమార్, పీజీ హెచ్ఎంలు నటరాజ్, ప్రభోద్, ఎంపీవో అజీజోద్దీన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దహెగాం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ కవిత అన్నారు. సోమవారం సమగ్ర కుటుంబ సర్వేపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు గ్రామాల్లో కుటుంబాల ఇళ్లకు స్టిక్కరింగ్ వేయాలని సూచించారు. 9 నుంచి పూర్తి వివరాలతో కూడిన సర్వే జరుగుతుందన్నారు. సర్వేకు వచ్చిన అధికారులకు ప్రజలు సహకరించాలని సూచించారు. ఇంటి యజమాని ఆధార్ కార్డు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సర్వే అధికారులకు సామగ్రి అందించామని తెలిపారు. సర్వే చేసే ఎన్యూమరేటర్లకు ఒక్కొక్కరికి 150 కుటుంబాలు కేటాయించామని పేర్కొన్నారు. ఎంపీడీవో రాజేందర్, డీటీ లలిత, పీఆర్ ఏఈ ఆత్మారాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఇంటింటి గణనపై శిక్షణ నిర్వహించారు. తహసీల్దార్ మునావర్ షరీఫ్ సర్వేలో పాల్గొననున్న సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ప్రభుత్వం రూపొందించిన నిబంధనల ప్రకారం సర్వేను విజయవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. సంబంధించిన సమస్యలను అధికారులకు తెలియజేయాలని సూచించారు. మండలంలో 55 మంది ఉపాధ్యాయులు, మిగతా శాఖల నుంచి 21 మంది ఉద్యోగులు మొత్తం 76 మంది ఎన్యుమరేటర్లు సర్వే నిర్వహించనున్నారని తెలిపారు. 8మంది పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి జయరాజ్, ఎంపీవో సుధాకర్ రెడ్డి, ప్రభుత్వ ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

లింగాపూర్: ప్రభుత్వం నిర్వహిస్తున్న సామాజిక ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వేపై ఎన్యూమరేటర్లకు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం లింగాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించినట్లు శిక్షణ ట్రెయినర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేలో అన్ని వివరాలను నమోదు చేయాలని సూచించారు. మండలంలో మొత్తం 40 మంది సిబ్బందితో ఈ నెల 6నుంచి 21వ తేదీ వరకు ప్రతీ ఇంటికీ వెళ్లి వివరాలు నమోదు చేయాలన్నారు. ఎంపీడీవో రామేశ్వర్, తహసీల్దార్ రాజేంద్రప్రసాద్, ఆర్ఐ ప్రదీప్‌కుమార్, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రెబ్బెన: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, కుల సర్వే కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేయాలని తహసీల్దార్ రామ్మోహన్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్ల శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎంపీడీవో శంకరమ్మ, ఎంఈవో వెంకటేశ్వర్లు ఎంపీవో వాసుదేవ్ పాల్గొన్నారు.

కౌటాల: మండలంలో సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. సోమవారం కౌటాల రైతు వేదికలో సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్యుమరేటర్లు పూర్తి వివరాలతో సకాలంలో సర్వే పూర్తి చేయాలని, ఈ నెల 6 నుంచి అన్ని గ్రామాల్లో సర్వే నిర్వహిస్తామని తెలిపారు. మండలంలో 85 బ్లాక్లలో సర్వే చేయడానికి 71 మంది సిబ్బందిని నియమించామని తెలిపారు. అనంతరం సిబ్బందికి సర్వే సామగ్రి అందించారు. ఎంఈవో గావుడే హన్మంతు, డీటీ మస్కూర్ అలీ, ఏపీఎం ముక్తేశ్వర్, ఏపీవో మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మండల యూత్ కమిటీ ఎన్నిక

కౌటాల: కౌటాల ఆరె సంక్షేమ సంఘం భవనంలో సోమవారం భారత రాష్ట్ర సమితి మండల యూత్ కమిటీని ఎన్నుకున్నారు. బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడిగా తాళ్లపల్లి కార్తీక్, ఉపాధ్యక్షులుగా జాడి బాజీరావు, ప్రధాన కార్యదర్శిగా కామ్రె గణేశ్, కోశాధికారిగా దద్ది గోపాల్, కార్యదర్శిగా చునర్కార్ దిలీప్‌లను ఎన్నుకున్నారు. నియోజకవర్గ కన్వీనర్ కాశిపాక రాజు, బండురావు, ఆనంద్, సురేశ్, నీలేశ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కౌటాల: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై మధుకర్ అన్నారు. సోమవారం మండలంలోని తాటిపల్లి గ్రామంలో పోలీస్‌కళా బృందం సభ్యులు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక కాలంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్న పోలీసులను ఆశ్రయించాలని, తగాదాలకు వెళ్లి జైలు పాలుకావద్దన్నారు. బృందం సభ్యులు రాంచందర్, రోహిత్, వెంకటేశ్, చంద్రశేఖర్, రజిత, సంఘవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు పంపిణీ

కెరమెరి: మండలంలోని చిన్న సాకడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ పాఠశాల విద్యార్థులకు సోమవారం పెందోర్ శ్యాంరావు పటేల్ సేవా సమితి ఆధ్వర్యంలో నోట్‌బుక్కులు, పెన్నులతో పాటు పండ్లు పంపిణీ చేశారు సేవా సమితి నాయకులు మాట్లాడుతూ పెందోర్ శ్యాంరావు 2వ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం సమాజ సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నోట్‌బుక్కులు, పెన్నులు, పండ్లు పంపిణీ చేస్తున్నామన్నారు. మాజీ ఎంపీపీ పెందోర్ మోతీరాం, ఎస్ఈఆర్పీ చాహకటి శ్యాంరావు, సేవా సమితి సభ్యులు పెందోర్ శ్రీనివాస్, వినేశ్, దుర్వ శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు సుజాత తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మాజీ జెడ్పీచైర్మన్ కోనేరు కృష్ణారావు ఆధ్వర్యంలో పలువురు కౌన్సిలర్లు, లారీ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్యను కలిసి సమస్యలను వివరించారు.

రైతులకు న్యాయం చేయాలని ఆందోళన

పంట నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం పట్టణంలోని ఏడీఏ కార్యాలయం ఎదుట కృష్ణారావు ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు.

పశువులకు వ్యాధి నివారణ టీకాలు

కెరమెరి: మండలంలోని చౌపాన్‌గూడ గ్రామంలో సోమవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. అనంతరం పశువైద్యాధికారి సురేశ్ మాట్లాడుతూ వారం రోజుల పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తామన్నారు.

కౌటాల: పశు సంపదను పెంచి రైతులు ఆర్థికంగా వృద్ధి చెందాలని పశువైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని నాగేపల్లి గ్రామంలోని పశువులకు టీకాలు వేశారు. పశువైద్య సిబ్బంది సందీప్, సత్యనారాయణ, బిక్షపతి, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

బెజ్జూర్: సమస్యలను పరిష్కరించాలని దివ్యజ్యోతి మండల సమాఖ్య సభ్యులు ఏపీఎంకు వినతిపత్రాన్ని సమర్పించారు. సోమవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. వారిలో వీవోఏల మండల అధ్యక్షుడు పెద్దల సంతోష్, కార్యదర్శి కోడిపే సుజాత, వీవోఏలు నీలయ్య, కేశవ్, మధుసూదన్, సురేష్, విజయ్ కుమార్, శంకర్, ఐకేపీ సిబ్బంది, ఏపీఎం మోహనలాల్, సీసీలు భద్రయ్య, తిరుపతి, పద్మ, భగవతి ఐకేపీ అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఏఈగా లక్ష్మీనారాయణ

ఆసిఫాబాద్: విద్యుత్ శాఖ ఆసిఫాబాద్ మండల ఏఈగా లక్ష్మీనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కామారెడ్డి నుంచి బదిలీపై వచ్చిన ఆయనను కార్యాలయ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఏఈ ఫిరోజ్ ఖాన్, లైన్‌మెన్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి

తిర్యాణి: ఇందిరా కాంత్రి పథకంలో పని చేస్తున్న వీవోఏల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏపీఎం సదానందంకు మండల కేంద్రంలో వినతిపత్రం అందజేశారు. వీవోఏలు మాట్లాడుతూ గత రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న స్త్రీనిధి ఇన్సెంటివ్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. వీవోఏలు అన్నపూర్ణ, వెంకటేశ్, సంతోష్ తదితరులు ఉన్నారు.

పోలీసుల సేవలు వినియోగించుకోవాలి

ఆసిఫాబాద్: ప్రజలు పోలీసుల సేవలు వినియోగించుకోవాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించారు. ఆయా మండలాల పోలీసు అధికారులతో మాట్లాడి సూచనలు ఇచ్చారు. ఫిర్యాదులను పరిష్కరించాలని సూచించారు.

ముగింపు దశకు దండారీ ఉత్సవాలు

తిర్యాణి: ఏటా ఆదివాసీలు సంప్రదాయబద్ధంగా గూడేల్లో నిర్వహించే దండారీ ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. సోమవారం మండలంలోని గుడిపేట గ్రామంలో దండారీ ఉత్సవాలను నిర్వహించారు.